# వెలుగు

✱

యం. యస్. చలం

ఐదు సంవత్సరాలు దీర్ఘంగా యోచించి శేఖరుడు ఓ నిర్ణయానికి రాగలిగాడు. తన కురూపి భార్యను విడిచిపెట్టి మరో అందమయిన కన్యను వివాహమాడాడు. యీ భార్యతో తనేమాత్రం సుఖించటంలేదని అతడు నిశ్చయంగా తెలుసుకొన్నాడు. లోకంలో అనేకమంది పురుషులు అందమైన భార్యలతో సుఖిస్తోంటే తన కర్మయేంకాలిపోయింది? పేదరికంలో వున్న తననౌకరు గోవిందుని యిల్లాయి కూడా చాలా అందంగా వుంటుంది. కాని లక్ష్మీసంపన్నుడైన తనకు ఆయోగం లేకపోయింది! యీ సమయాన శేఖరునకు ప్రపంచంలోని కురూపి భార్యలుగల పురుషులందరివల్లా సానుభూతి కలిగింది.

పార్వతిని విడిచిపెట్టడంవల్ల లోకం అతణ్ణి నిందిస్తుందన్న విషయం అతనికి తెలుసు. లోకనిందకు భయపడి నా సుఖాన్ని నేనెందుకు త్యాగం చేసుకోవాలి? అని అతడి వుద్దేశం. పార్వతిని తనుకోరి వివాహమాడలేదు. తనకు తెలియని రోజుల్లో తండ్రి తెచ్చి మెడకు కట్టాడు. తత్ఫలితంగా భవిష్యత్తులో తన కుమారుడు ఎంతబాధపడతాడో అన్నజ్ఞానం తండ్రికి లేకపోయినందుకు ఆయన్ని లోలోన నిందించాడు. పైగా తన తండ్రితప్పిదానికి ఫలితం నేనెందుకు అనుభవించాలి? అనుకున్నాడు. అలా అని తండ్రి యిచ్చిపోయిన ఆస్తిని అనుభవించడానికి నేనెవణ్ణి? అనిమట్టుకు అనుకోడు!

ఇక్కడ పార్వతిని గురించి కొంతచెప్పడం అప్రస్తుతం కాదనుకుంటాను. ఆమెను కురూపి అనడంకంటే అమాయకురాలు కానట్లయితే తన వలన భర్తయెంత బాధపడుతున్నాడో యీ పరికి తెలుసుకొని వుండేది. తనవలన భర్త బాధపడుతున్నాడనే సంగతి తెలియకపోగా భర్తవలన తను సుఖించటం లేదన్న విషయం కూడా ఆమెకు తెలియదు. యిక ఆమెకు తెలిసిందల్లా ఇదీ—తను ఒకానొక వ్యక్తికి సతిననీ, ఆవ్యక్తి తనకు దైవసమానుడనీ, యీవిషయాన్ని ఆమె యీయీ చేష్టలవల్ల ఋజువు చేస్తుంది.

కాలంమార్పువల్ల శేఖరునకు ఏకొంచెం అస్వస్థత కలిగినా ఆమె నానాహంగామా చేస్తుంది. అతడు పనిమీద గ్రామాంతరం పోయిరెండు, మూన్నాళ్లు రాకపోతే, కూడూ నీరుమానివేసి అతనిరాక కోసం యెదురుతెన్నులు చూస్తుంది. యీ సమయాన ఆమె మనస్సు భర్తపట్లకీడును శంకిస్తోవుంటుంది. అవునుమరి—ఎక్కడ పరిపూర్ణమైన ప్రేమవుంటుందో అక్కడకీడును శంకించే స్వభావంకూడా వుంటుంది. అనేకసార్లు ఆమె భర్తయొక్క కోపతాపాలకు గురిఅయింది. కాని యీకోపాలకు హేతువేమిటి? అని ఆలోచించి బుర్రచెడగొట్టుకోలేదు. అన్నిటికీ తలఒగ్గి వుండగల సహనం ఆమెకు జన్మతః వచ్చిందా? అనిపిస్తుంది.

ఒకానొక దుస్సమయాన శేఖరుడు తన మనస్సును పార్వతియెదుట బయటపెట్టాడు. ఆమెను పుట్టినింటికి పోవలసిందని ఆజ్ఞాపించాడు.

పార్వతి తన గుండెలను యెవరో రంపంతో కోస్తున్నట్లు బాధపడింది. అయితే—మీపాదాలచెంత ఒకింతస్థానం యివ్వవలసిందని భర్తను వేడుకోలేదు. ప్రతికక్షి హృదయాన్ని కరిగించటంకోసం యిలాంటి నాజూకు పదాలను వాడటం ఆమెకు తెలియదు. ఆమె యిలాఅంది. "నేనుపోను—యిక్కడే వుంటాను." ప్రత్యర్థిలో హృదయమంటూవుంటే యీ మాటల్లోనే రాళ్లను కరిగించగల పటిమ వున్నదని గుర్తించకపోడు.

శేఖరుడు గద్దించి అన్నాడు. "ఎందుకు పోవు?" యీ సమయాన కరుణకు, జాలికి తనలో స్థానం యివ్వటంవలన ప్రయోజనంలేదని అతడు నిశ్చయించుకున్నాడు.

పార్వతి యేడ్చింది. ఆయేడ్పు శ్రీకృష్ణుడు పారిజాతపుష్పాన్ని రుక్మిణికి యిచ్చినప్పుడు సత్యభామ యేడ్చిన యేడ్పువలె లేదు. ప్రవరాఖ్యుని నిరాకరణతిన్న వరూధిని విలాపము వలెనూ లేదు. అశోకవనమందలి సీత శోకము వలె వున్నది.

శేఖరుడు తిరిగి పెళ్లాడుతున్నందుకు, పార్వతికి అసూయగాని, కోపంగాని ద్వేషంగాని లేదు. అతడు పది పెండ్లిండ్లు చేసుకొన్నా ఆమెకు యీ భావనే వుంటుంది. కాని అతణ్ణి విడిచివుండలేదు. అలాంటి కృతఘ్నుణ్ణి యెందుకు విడిచివుండలేదు? ఎందుకు వుండలేదో ఆమెకే తెలియదు. ఆమె అర్థాంగి. ఒకానొక పురుషుని శరీరంలో ఆమె ఒక భాగం. ఆ భాగం వేరుకావటం అసాధ్య విషయం. యీ సంగతి తెలిసినా తెలియకపోయినా యీ భావన స్త్రీహృదయంలో దాగివుండనే వుంటుంది.

శేఖరుడు కొలదిరోజులలోనే ఓబ్రతికి చెడిన కుటుంబంలోని అందమైన కన్యను వివాహమాడాడు. యీ అపురూప సుందరియొక్క రూపలావణ్యం తనకు పరిపూర్ణ శాంతినివ్వగలదని భావించాడు. కాని—

రెండేండ్లు తిరుగకముందే శేఖరుడు తన జీవితాన్ని పర్యావలోకన చేసుకొనక తప్పలేదు.

"నేనిప్పుడు సుఖిస్తున్నానా?" అని అతడు ప్రశ్నించుకున్నాడు. అవును. సుఖించాడు. ఆ సుఖంలో యెంత ఆనందమున్నది? సుఖము శారీరకమైనది. ఆనందం హృదయగత సంబంధిని.

యీ నూతన భార్య గర్విష్టి. ఆ గర్వానికి రూపమే హేతువు. రూపవతులందరు గర్విస్తారని కాదు. ఆ గర్వం అనుక్షణం భర్తయెదుట ప్రదర్శిస్తోనే వుంటుంది. ఆ ప్రదర్శనవలన శేఖరుడు తన పురుషత్వం ఒక స్త్రీ యెదుట వాల్చినట్లు భావిస్తాడు. అయితే ఆభావం ఎంతోసేపు వుండదు. రూపదాసుని యొక్క భావనలు రూపలాలసతలో లీనమై మెరపు వలె మాయమవుతాయి. కాని ఆ భావన యొక్క ఛాయ ఆ హృదయంలో అచ్చుగ్రుద్ద బడేవుంటుంది.

సౌందర్యం అంటేఏమిటి? బాహ్యమైనదేనా? మరొకటి వున్నదా? బాహ్యమైనదే అయితే అతనికి కరువులేదు. అయితే యీ బాహ్యసౌందర్యం అతని సంపూర్ణ సుఖాన్ని యివ్వటంలేదు. మరొక సౌందర్యం వుండాలి. వున్నది—అది హృదయ సౌందర్యం. మానవుడు శారీరక సౌందర్యాన్ని అనుభవించి తృప్తి పడలేడు. శారీరక సౌందర్యం శారీరక తృప్తినే యిస్తుంది. మనుష్యునకు శరీరమేకాదు వున్నది; హృదయం కూడా వున్నది. అదికూడా తృప్తిపడాలి. దానితృప్తి కోసం హృదయ సౌందర్యాన్ని అనుభవించవలసిన అవసరం కూడావుంది: అయితే ఆ సౌందర్యం అతడి అనుభవించినంతకాలం, దానిని అనుభవిస్తున్నాననే విషయం తెలుసుకోలేక బుద్ధిపూర్వకంగా పోగొట్టుకున్నాడు.

తను ఒకసారి జ్వర పడ్డాడు. నెలరోజుల వరకు లేవలేదు. ఆ సమయాన తన రెండవభార్య నౌకర్లు చూపిన శ్రద్ధకూడా చూపలేదు. అదేపార్వతి అయితేనో? అనుకున్నాడు. యీనాడు తనకష్టాల్లో పాలుపంచుకొనే వారులేరు. తనరాకకోసం నిరీక్షించే వారులేరు. అనేకసార్లు అతడు అలుక వహించేవాడు. తన అలుకను గుర్తించి తనతల్లి లాలనచేసేంది. తరువాత పార్వతి. కాని యీనాడు?

ఇలాయోచించేసరికి శేఖరుని కనుకొనలనుండి అశ్రువులు జారినై. అతని మనోనేత్రాల యెదుట పార్వతి సాక్షాత్కరించింది. అతనుపార్వతిని విడిచిపెట్టాడు. కాని పార్వతి తన్నువిడువలేదు. తను వ్యథిత హృదయుడైనప్పుడెల్ల ఆమె కనిపిస్తోనే వుంది! శేఖరుని కన్నీరు మరింతధారగా ప్రవహించసాగింది. అతని అధరాలు కంపించినై. ఆకంపితాధరాలనుండి "పార్వతీ! యీనాటికి నేను వెలుగు చూడగలిగాను!" అన్నవాక్యం జాలువారింది.—